క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పేద మహిళలకు 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద గుర్తింపు పొందిన శిక్షణ సంస్థల నుంచి ఉచిత గృహ కుట్టు మిషన్లు అందజేస్తుందని మైనారిటీ శాఖ జిల్లా అధికారిణి శైలజ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు ఈ నెల 31లోపు జిల్లా మైనారిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను 99895 92071 సంప్రదించాలని సూచించారు.

కమిటీల ఏర్పాటు



పలిమెల: మండలంలోని ఆయా గ్రామాలకు ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షులు చెన్నూరి నిలేష్, మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మూకునూరు గ్రామ అధ్యక్షుడిగా కల్లూరి రాజు, నీలంపల్లి అధ్యక్షుడిగా చెన్నూరి రాజు, సర్వాయిపేటకు తిప్పనిపెల్లి నర్సింహరావు, పంకెనకు అంబాల రాజు, లెంకలగడ్డకు చెన్నూరి రాకేష్, మహిళా అధ్యక్షురాలిగా చెన్నూరి జక్కమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నియామకం



భూపాలపల్లి అర్బన్: మానవ హక్కుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన గుండాల సునిల్‌చంద్రను జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప గురువారం ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బాధ్యతలు అప్పగించాడు.

'చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: కాళేశ్వరం పంచాయతీ ఆధ్వర్యంలో టోల్‌టాక్స్ టెండర్ దక్కించుకున్న వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వారిపై కలెక్టర్ చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. టోల్‌టాక్స్‌లో వసూళ్లు చేస్తు పలువురిపై దాడి చేశారని ఆరోపించారు. ఆయన వెంట పంతంగి సతీష్, రేవెల్లి రాకేష్‌లు ఉన్నారు.

'కక్షతోనే ఆరోపణలు'

కాళేశ్వరం: కాళేశ్వరం మాజీ సర్పంచ్ భర్త వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తనపై బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పటి కక్షలతో పాటు తనకు టోల్‌టాక్స్ టెండర్ రాడంతో పాటు అతడి అనుచరులకు రాలేదని అక్కసుతో ఆరోపణలు చేస్తున్నాడని మాజీ ఎంపీటీసీ మమత భర్త నాగరాజు ఆరోపించారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై దళి తుడని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ఎదుగుదల ఓర్వలేకనే విమర్శలు'

కాళేశ్వరం: పలిమెల భూముల్లో మంత్రి సోదరుడు శీనుబాబు వాట ఉందని, బ్లాక్‌కాంగ్రెస్ నాయకుడు కోట రాజబాపునకు భూమి ఉందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలను మండల కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు ఖండించారు. గురువారం మహదేవపూర్ ప్రెస్‌క్లబ్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. బీసీ బిడ్డ అయిన కోట రాజబాపు ఎదుగుదలను ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని అన్నారు. వారి వెంట యూత్‌కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి, అంకుషాపూర్, పంగిడిపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట పొన్నం సాంబయ్య, శాస్త్రాల కిరణ్, మాదాసి మహేందర్, మారం రాంరెడ్డి, నూనేటి రమేష్, అల్లం ఓదెలు, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన మాదుగుల వీరేంద్ర(12) కొన్ని రోజులుగా బ్రెయిన్ కేన్సర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాలుడి తండ్రి గతంలో కరోనా కాటుకు బలికాగా, బాలుడు బ్రెయిన్ కేన్సర్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

పాఠం చెప్పేదెవరు..?

సమ్మెలో కేజీబీవీ ఉపాధ్యాయులు

- సాగని తరగతులు.. పూర్తి కాని సిలబస్
- సమీపిస్తున్న పరీక్షలు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్న ఉన్నతాధికారులు



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

రేగొండ: డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెతో కేజీబీవీలో పాఠాలు చెప్పే వారు కరువయ్యారు. దీంతో విద్యార్థినులు సిలబస్ పూర్తవుతుందో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది, కేజీబీవీలోని ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలలో పాల్గొంటున్నారు. కేజీబీవీలో విద్యార్థులకు భోజనం, ఇతరత్రా విషయాలలో అసౌకర్యం కలగకుండా నాన్ టీచింగ్ సిబ్బందితో నెట్టుకోస్తుండగా.. బోధనపై ప్రభావం పడుతోంది. ఎఫ్ఏ–3 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో తరగతులు నిర్వహించాల్సి ఉండగా.. ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడం వలన కేజీబీ వీ విద్యార్థులకు సబ్జెక్టులు పూర్తిగా వెనకబడిపోవడంతో పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపనుంది.

ప్రత్యామ్నాయ చర్యలు..

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ చర్యలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ప్రతి రోజు కేజీబీవీ సందర్శించి సమయం, భద్రత, నాణ్యమైన ఆహారం అందించడంలో అంతరాయం కలగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పదుల సంఖ్యలో ఉండే కేజీబీవీ టీచర్ల స్థానంలో ఒకరిద్దరు ఉపాధ్యాయులతో బోధన ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి. పదో తరగతి సెలబస్ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల గడువు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో కేజీబీవీలో ప్రభుత్వ టీచర్లతో బోధన ఉపాధ్యాయ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఐఆర్‌పీ, మెసెంజర్‌లు, కేజీబీవీ లోని ఎస్ఓలు, సీఆర్‌టీలు సమ్మెలో ఉన్నారు. ఒకట్రెండ్ రోజుల్లో నాన్‌టీచింగ్ ఉద్యోగులు సమ్మె బాట పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 12 రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు పలు మండలాల ఎంఈఓలు సంజీవరెడ్డి, ప్రకాశ్‌బాబు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి, పలు విద్యార్థి సంఘాల నాయకులు పసుల వినయ్, శనిగారపు సుమన్ బొట్ల సురేందర్ వేల్పుగొండ హరీశ్ సంఘీభావం తెలుపగా ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎండీ చాంద్‌పాషా, వేణు, రాజయ్య, సీహెచ్ సునీత, చంద్రకళ, నిర్మల,నరేష్, శ్రీనివాస్ తిరుపతి ప్రసాద్ రమాదేవి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద



పిల్లల ఎత్తు కొలుస్తున్న జయప్రద

చిట్యాల: తల్లిపాలతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలోని ఒకటి, నాలుగవ అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ జయప్రద సందర్శించారు. గర్భిణుల, పిల్లల బరువులు, ఎత్తులు చూసి పోషణ స్థాయి వివరాలను అంచన వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పుట్టిన వెంటనే పిల్లలకు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలలు వచ్చే వరకు కేవలం తల్లీపాలు తాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, కరుణ, శారద, తిరుపతమ్మ కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

- తపాలాశాఖ సబ్ డివిజన్ అధికారి అజారొద్దీన్



మాట్లాడుతున్న అజారొద్దీన్

కాటారం: బ్యాంకులకు దీటుగా తపాలా శాఖ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని తపాలాశాఖ సబ్ డివిజన్ అధికారి సయ్యద్ అజారొద్దీన్ సూచించారు. మండల కేంద్రంలో కాటారం సబ్ డివిజన్ లోని తపాలాశాఖ ఉద్యోగులతో గురువారం సమావేశం నిర్వహించారు. తపాలాశాఖ ద్వారా గ్రామాల్లో అందుతున్న సేవలు, ఖాతాదారుల సంఖ్య, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తీరుపై సబ్ డివిజన్ అధికారి ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తపాలాశాఖ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. మావోయిస్టు ప్రభావిత మండలాలు కావడంతో ప్రతి గ్రామంలో పోస్టాఫీస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తపాలాశాఖ సేవలను గ్రామాల్లో విస్తృత పర్చేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. బ్యాంక్‌లకు సమానంగా తపాలాశాఖ ద్వారా అందుతున్న పథకాలు, బీమా, సేవింగ్ బెనిఫిట్స్ గూర్చి ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోస్టాఫీసులో ఖాతా కలిగి ఉండి లబ్ధి పొందేలా చూడాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తపాలాశాఖ ద్వారా అందుతున్న పథకాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ ఉద్యోగులు కుడుదుల కిష్టయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి



కొండాయి గొత్తికోయగూడెంలో పరీక్షలు చేస్తున్న ప్రణీత్‌కుమార్



లింగాపురంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: చలికాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొండాయి, గొత్తికోయగూడెంలో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించి ఇంటింటి సర్వేలను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రణీత్‌కుమార్ మాట్లాడుతూ.. 38 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. గర్భిణులకు పరీక్షలు చేసి తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఆశవర్కర్లు లక్ష్మీ, జ్యోతి, భాగ్య, లక్ష్మీ, సునీత పాల్గొన్నారు. అలాగే మండలంలోని లింగాపురం, అల్లంవారిఘణపురం గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వేలు చేపట్టి జ్వరం పరీక్షలు చేశారు. జ్వరపీడితులతోపాటు అనారోగ్యంగా బారిన వారిని కూడా పరీక్షలు చేసి వివరాలను సేకరించారు.

జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయండి

- యూఎస్‌పీసీ జిల్లా ఇన్‌చార్జ్ చాప బాబు



మాట్లాడుతున్న చాప బాబు

గోవిందరావుపేట: అవినీతి పరులను తొలగించి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాలని లేదంటే దశల వారిగా ఆందోళనలు చేపడుతామని యూఎస్‌సీసీ(ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) జిల్లా ఇన్‌చార్జ్ చాప బాబు అన్నారు. మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల చల్వాయిలో గురువారం జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా చాప బాబు హాజరై మాట్లాడారు. జిల్లా విద్యా శాఖలో గతంలో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు ఇటీవల వెలుగులోకి వచ్చిన గల్లంతైన కంప్యూటర్ల విషయంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో జిల్లా విద్యాశాఖాధికారి యూఎస్‌పీసీకి ఇచ్చిన హామీ మేరకు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఏసీజీఈ, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్‌ను విధుల నుంచి తొలగించి పాఠశాల విధులకు పంపాలని డిమాండ్ చేశారు. క్వాలిటీ కోఆర్డినేటర్‌గా తాత్కాలికంగా నియమించిన మల్లారెడ్డిని తొలగించి నిబంధనల ప్రకారం నియామకం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ రెడ్డి, గన్ రెడ్డి, ఆది రెడ్డి, హట్కర్ సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న రాజబాపు

పలిమెల: కాంగ్రెస్ నాయకులు అసత్యపు ప్రచారాలు మానుకోని రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇరువై సంవత్సరాలుగా భూములు పోకుండా రైతుల పక్షాన నిలబడి కొట్లాడినం ఇకముందు కూడా రైతుల పేరు మీద పట్టాలు అయ్యే వరకు పోరాటం చేస్తామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంది ఆ పార్టీ నాయకులు మాటలు బంద్ చేసి దక్కన్ కంపెనీ రిజిస్ట్రేషన్లు రద్దు చేసి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్లు చేపించి చిత్తశుద్ధిని నిరుపించుకోవాలన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

వాజేడు: రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పనులను చేస్తుండగా మిషన్ భగీరథ పైపులైన్ గురువారం పగిలిపోయింది. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం నుంచి చెరుకూరు గ్రామం వరకు ఫోర్ వే లైన్ పనులు చేస్తున్నారు. కాగా, జగన్నాథపురం గ్రామం వద్ద రహదారి విస్తరణ కోసం రెండు పక్కల పొదలను, చెట్లను తొలగిస్తున్నారు. రహదారి పక్కన మట్టి తీస్తుండగా జగన్నాథపురం నుంచి అవతలి వైపున ఉన్న సుమారు 30 గ్రామాలకు తాగు నీటిని చేర వేసే ప్రధాన పైప్ లైన్ పగిలిపోయింది. విషయాన్ని మిషన్ భగీరథ సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన పగిల పైప్ లైన్ మరమ్మతులను చేసి సాయంత్రం తాగు నీటిని సరఫరా చేశారు.

క్వారీ నిర్వహణకు గ్రామసభ

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు ఇసుక క్వారీ నిర్వహణ కోసం ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామ సభను రైతు వేదికలో నిర్వహించారు. బుధవారం జరుగాల్సిన గ్రామ సభ కోరం లేకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. కోరానికి 175 మంది మద్దతు అవసరం ఉండగా 221 మంది హాజరై చేతులు ఎత్తి క్వారీ నిర్వహణకు మద్దతు ప్రకటించినట్లు ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు 2004–05 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఎంఈఓ దివాకర్, ప్రధానోపాధ్యాయుడు సోమరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కంప్యూటర్లు బహూకరించారు. రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీశ్, వేణుగోపాల్, రవి కిరణ్, వీర భద్రి, ఉపాధ్యాయులు సుధాకర్, వెంకటస్వామి, నాగమణి, పద్మలత, మల్లికార్జున్, ప్రవాహ, అనిత, కిరణ్ కుమారి పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

రేగొండ: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాల క్రాస్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌లు హరిబాబు, సమ్మయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- ఎంపీడీఓ అడ్డూరి బాబు



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ అడ్డూరి బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న సర్వేను గురువారం ఎంపీఓ వీరస్వామితో కలిసి పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరు, సేకరిస్తున్న వివరాలు, ఆన్‌లైన్ నమోదు, తదితర అంశాలపై ఎంపీడీఓ ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సిబ్బందికి సూచించారు. సర్వే పారదర్శకంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ

- నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు చిన్నరాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి అర్బన్: రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని తెలంగాణ నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు పొక్కూరి చిన్నరాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలు కులసమీకరణలకు పెద్దపీట వేస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం షెడ్యూల్డ్ కులాలకున్న 15 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ చేసి 59 కులాలకు జనాభా దామాషా ప్రకారం పంచి పెట్టాలన్నది వర్గీకరణ ఉద్దేశమన్నారు. రాజ్యాంగం కూడా దళితులకు సమాన అవకాశాలను అందించే లక్ష్యంతో రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. దళిత కులాల కోటాను కులాల వారిగా వర్గీకరించి ఎవరివాటాను వారికి కేటాయించాలనే ఆందోళనలు జరుగుతున్నప్పటికీ ప్రధానమైన రాజకీయ పార్టీలు మాల, మాదిగ వర్గాల్లో విభేదాలు సృష్టించేందుకు నిప్పు రగిలించి నీళ్ల కోసం వెతికినట్లుగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. నాయకులు కోటేశ్వర్, లోయిథ్, దేవరాజ్‌లు పాల్గొన్నారు.

మాల సంఘం నాయకుల అరెస్ట్



చిట్యాల: అరెస్టు అయిన నాయకులు



టేకుమట్లలో..



రేగొండలో..

టేకుమట్ల: తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాల మహానాడు మండల అధ్యక్షులు కోంద్ర రమేష్, గౌరవ అధ్యక్షులు బందెల నరేష్, కోంద్ర రమేష్లు ఉన్నారు. అనంతరం మాలలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందస్తు అరెస్టులు చేయడం సరైంది కాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.

చిట్యాల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాల సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా గురువారం అరెస్ట్ చేశారు. మండల మాల సంఘం కన్వీనర్ పిసర సురేష్, కో కన్వీనర్ కంకణాల శంకర్, అంకేశ్వరపు రాజు, పట్టెం శంకర్ ఉన్నారు.

రేగొండ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి.. మండలంలోని మాల మహానాడు నాయకులు హైదరాబాద్ వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పసుల అశోక్, జిల్లా, మండల నాయకులు ముద్దమల్ల సమ్మయ్య, పసుల రాకేశ్, పసుల రాజు ఉన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ



గోవిందరావుపేట: మాట్లాడుతున్న సాంబశివ

గోవిందరావుపేట: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ అన్నారు. సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం పార్టీ నాయకుడు గుండు రామస్వామి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా అమిత్ షా మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిట్టిబాబు, రఘుపతి, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, మండల కమిటీ సభ్యుడు గుండు లెనిన్, చంద్రారెడ్డి, నాగరాజు, నగేష్, ఐలయ్య పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని నేతకాని(మహర్) కుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు అన్నారు. గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడారు. కావిరి సంతోష్, చంద్రబాబు, గోగు సుధాకర్, మండల అధ్యక్షుడు రాంబాబు, దుర్గారావు ఉన్నారు.

వాజేడు: అంబేడ్కర్ గురించి తప్పుగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కుమ్మరి రాంబాబు ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

- పూనెం సాయి



దీక్ష ప్రారంభిస్తున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలను గిరిజనేతరులకు తాకట్టు పెడుతున్న అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని గోడ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండ కేంద్రంలో కొమరంభీం కాలనీ వాసులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం నాలుగవ రోజు సాయి ప్రారంభించి మట్లాడారు. ప్రభుత్వం ఆదివాసీల పక్షాన పని చేయాలని లేకుంటే ఇలాంటి ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఆదివాసీ ఓట్లతో గెలిసిన ఎమ్మెల్యేలు నాలుగు రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు జరుగుతున్న స్పందించక పోవడం బాధాకరమన్నారు.